పల్లెను ప్రతిబింబించేలా..

- ఆకట్టుకుంటున్న డెయిరీ ఫారం కూడలి
- ఎడ్ల బండి, రైతుల బొమ్మలతో కనువిందు


గొడుగు వేసుకొని పొలంలోకి వెళ్తున్న రైతు బొమ్మ


కూడలిలో ఏర్పాటు చేసిన మట్టి కుండలతో పల్లెటూరి మహిళ ప్రతిమ

ఆరిలోవ : పల్లె సంస్కృతి సంప్రదాయాలకు జీవం పోస్తూ జాతీయ రహదారిపై డెయిరీ ఫారం కూడలిలో ఏర్పాటు చేసిన కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. జీవీఎంసీ నగరంలో కూడళ్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలు కూడళ్లు ఇప్పటికే సిద్ధమయ్యాయి. మరికొన్ని కూడళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. పాత డెయిరీ ఫారం వద్ద కూడలి ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇక్కడ గతంలో వాటర్ ఫౌంటేన్, మధ్యలో పడవ ఉన్నట్లు తయారు చేశారు. ఇటీవల ఆ ఆకృతిని తొలగించి మరింత శోభను తీసుకొచ్చేలా డిజైన్ చేశారు. ఇక్కడి కూడలిలో నాలుగు బొమ్మలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటికి పెయింటింగ్ వేస్తున్నారు. ఈ కూడలిలో ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఎడ్ల బండి ఏర్పాటు చేసి చుట్టూ గ్రిల్స్ పెట్టారు. ఆ బొమ్మకు వేసిన రంగులు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. దీనికి ఎదురుగా రెండు మట్టి కుండలు పట్టుకుని కూర్చొన్న పల్లెటూరి మహిళ, ఆ పక్కనే ఓ చక్రం బొమ్మ అమర్చారు. వీటితో పాటు కూడలికి రెండు వైపులా రైతు బొమ్మలు తీర్చిదిద్దారు. ఓ వైపు తాటాకుల గొడుగు వేసుకొని పొలంలోకి వెళ్తున్న రైతు బొమ్మ, మరో వైపు ఎండలో తాటాకులు గొడుగు వేసుకొని చేత పార పట్టుకుని పొలం పని చేస్తున్న మరో రైతు బొమ్మ ఏర్పాటు చేశారు. ఈ బొమ్మలకు కార్మికులు ప్రస్తుతం పెయింటింగ్ వేస్తున్నారు. ఈ కూడలిలో ఏర్పాటు చేసిన పల్లెటూరి బొమ్మలు స్థానికులు, ప్రయాణికులకు ఆకట్టుకుంటున్నాయి.


పార పట్టుకుని నిల్చున్న రైతు బొమ్మ వద్ద రంగులు వేస్తున్న కార్మికుడు


డెయిరీ ఫారం కూడలిలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండి ఆకృతి

జోడుగుళ్లపాలెంలో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డ్ జోడుగుళ్లపాలెంలో పార్కు నిర్మాణం కోసం గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీకి చెందిన సుమారు అరెకరం పైగా ఖాళీ స్థలంలో పార్కు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో పెద్దలు సేదదీరడానికి అవసరమైన ఏర్పాట్లు, పిల్లలు ఆటల కోసం పచ్చని మైదానంలో పరికరాలు, వాకింగ్ ట్రాక్, యోగా వేదిక, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇందు కోసం జీవీఎంసీ అధికారులు రూ.1.08 కోట్లు నిధుల కేటాయించినట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ డీఈ వంశీకృష్ణకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరమాని రాంబాబు, నాయకులు వేజెల్ల సుబ్బరాజు, బుడుమూరు గోవింద్, గరికన నూకరాజు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాల బహూకరణ


వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో పుస్తకాలు అందజేస్తున్న ఆచార్య శ్రీనివాసరావు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాలు, జర్నల్స్‌ను మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు బహూకరించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో గురువారం స్టాటస్టిక్స్ విభాగంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆచార్య కె.శ్రీనివాసరావు స్టాటస్టిక్స్ విభాగం ద్వారా వర్సిటీకి 40 ఏళ్లు సుధీర్ఘ సేవలు అందించారు. వివిధ హోదాల్లో వర్సిటీ ప్రగతికి కృషి చేశారు. తన పరిశోధనలకు సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్ ఆల్బమ్స్‌తో పాటు ప్రముఖ వ్యాసాలతో కూడిన పుస్తకాలు విభాగ లైబ్రరీ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో బహూకరించారు. ఈ సందర్భంగా వీసీ ఆయన సేవలను ప్రశంసించడంతో పాటు 1300 పుస్తకాలు విభాగ లైబ్రరీకి అందించడంపై అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయంత్రం పాఠశాల నిర్వహణ

మద్దిలపాలెం : బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మురికివాడల్లో బడిఈడు పిల్లలు, చదువు మధ్యలో ఆపేసిన బాలలకు విద్యను అందించడానికి సాయంత్రం పాఠశాలను నిర్వహించనున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నవర ప్రకాశరావు తెలిపారు. బీచ్ రోడ్డులో ఫిషింగ్ హార్బర్ సిప్నెట్ హాస్టల్ పక్కన బీవీఎఫ్ బ్రిడ్జి స్కూల్ ప్రాంగణంలో ఈ సాయంకాల పాఠశాల కొనసాగుతుందన్నారు. ఆసరా చారిటబుల్ ట్రస్ట్ సహాయంతో ఈ నెల 28వ తేదీ నుంచి సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకూ ఈ పాఠశాల నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

బీవీకే పాఠశాలలో మొక్కల పెంపకం


బీవీకే పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో బీవీకే పాఠశాల ఆవరణలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీవీకే బోర్డు డైరెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల కలిగే ఉపయోగాలు, పర్యావరణం ఆవశ్యకత, పర్యావరణంలో పచ్చదనం ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీవీకే ప్రతినిధులు మధుకర్, నర్సింహారావు, హెచ్‌ఎం మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం


కిడ్నీ బాధితురాలికి సహాయం అందిస్తున్న రాజీవ్‌నగర్ వాసులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో కిడ్నీ సమస్యతో కొన్నాళ్లుగా బాధపడుతున్న ఓ మహిళకు స్థానికులు ఆర్థిక సహాయం అందించారు. రాజీవ్‌నగర్‌లో షేక్ వాలిబీ అనే మహిళకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. గత ఆరు నెలలుగా ఆమెకు వారానికి రెండు సార్లు డయాలసిస్ చేస్తున్నారు. ఆమె ఏ పనీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో గ్రామస్తులు ఆమెకు ఆర్థిక సహకారం అందిండానికి ముందుకు వచ్చి తోచినంత ఇచ్చారు. ఇలా సేకరించిన రూ.26,200 నగదును గురువారం రాజీవ్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళలు బాధితురాలి ఇంటికి వెళ్లి అందించారు. దీంతో షేక్ వాలిబీ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మూడడ్ల రమ, గోల్తు లక్ష్మి, గోపిశెట్టి వెంకటలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. గురువారం ఆరిలోవ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డయేరియా పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఆయన ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ సందర్శనలో డీపీవో ఎన్‌హెచ్‌ఎం శశి భూషణ్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి


మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర బీజేపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాల ఆవరణలో ఒక చెట్టు- అమ్మ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ పలువురు నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజకీయ చరిత్రలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయని సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి జులై 6 వరకు దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఏఎస్ రాజా కళాశాలలో మొక్కలు నాటినట్లు తెలిపారు. పర్యావరణంలో కార్బన్ ఉద్గారాలు నియంత్రణకు కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 52 డిగ్రీలకు చేరడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ సమతుల్యతను కాపాడే విధంగా పెద్ద ఎత్తున విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మైక్రో బయోమ్ దినోత్సవం


ఆచార్య విజయభారతిని సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ మైక్రో బయోమ్ దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని గాయత్రి కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాపరిషత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ టెక్నాలజీ ఎండీ ఆచార్య డి.విజయభారతి మాట్లాడుతూ మానవుల సర్వతోముఖాభివృద్ధిలో, సంపూర్ణ ఆరోగ్య సాధనలో మైక్రో బయోమ్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఉదరంపై జీవనిర్మాణ ప్రక్రియకు సహకరించే మైక్రో బయోమ్‌లు వృద్ధికి ఏరకమైన ఆహారాన్ని స్వీకరించాలో తెలియజేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక వైద్య విజ్ఞానంలో మైక్రోబయోమ్ విధానం అనేక ఆనారోగ్య రుగ్మతలకు పరిష్కారం చూపుతుందన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆచార్య భారతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆచార్యులు గిరిధర్, పల్లవి, సుజాత, శ్యామల, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతో 'ఉక్కు'కు పూర్వవైభవం


మాట్లాడుతున్న ఉక్కు పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయగలిగితే పునరుజ్జీవం పొంది, పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1232వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. వీరిద్దరూ తలచుకుంటే ఉక్కు ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగడంతో పాటు పూర్వవైభవం ఉక్కుకు రాగలదన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఎన్నో అవరోధాలు, ఆటంకాలను దాటుకుని ఉక్కు పరిశ్రమను విస్తరించుకుంటే పారిశ్రామికవేత్తల ఆకలిని తీర్చడానికి విశాఖ ఉక్కును బలిపశువును చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు జయ, బి.ఎస్.రాజు, డి.సి.హెచ్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అప్పారావు, గోవింద్, రమణ, దాసరి శ్రీను, గంగాధర్, అప్పారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యం

మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ స్పష్టం చేశారు. విశాఖ మహానగరంలో విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలకు సరైన ప్రభుత్వ గ్రంథాలయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నేతలకు గ్రంథాలయం అవసరం పట్టలేదని ఆయన ఆరోపించారు. దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పౌరగ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ అధ్యక్షత జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలం నేటికి సీఆర్‌పీఎఫ్ వారి ఆధీనంలో ఉందన్నారు. గ్రంథాలయం పునర్నిర్మాణం కోసం కొత్త ప్రభుత్వం పూనుకోవాలని ఆయన కోరారు. గ్రంథాలయానికి నిధుల కొరత లేదన్నారు. ప్రజలను ముక్కుపిండి ఆస్తిపన్ను వసూలు చేసిందని, అందులో 8 శాతం లైబ్రరీ సెస్ రూ.200 కోట్లకు పైగా జీవీఎంసీ గ్రంథాలయ సంస్థకు బకాయి పడిందన్నారు. అధికారం ఇస్తే గ్రంథాలయ భవన నిర్మాణం చేపడతానని జనసేన అధ్యక్షుడు పవన్ ఇచ్చిన మాట ఇప్పుడు నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే భవనం పునర్నిర్మాణం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రంథాలయ సమితి రిటైర్డ్ కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఏయూ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, సీహెచ్‌వీఎల్ఎన్ శాస్త్రి, పి.మణి, ఎస్.ప్రకాశరావు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ మెకానిక్ అదృశ్యం


అదృశ్యమైన రాము(ఫైల్)

ఆరిలోవ: ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మారికవలసలో శెట్టి రాము భార్య, ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. ఈయన ఆదర్శనగర్‌లో ఓ సైకిల్ షాపులో మెకానిక్‌గా పనిస్తున్నాడు. ఎప్పటికలాగే ఈ ఏడాది మే 15న మారికవలస నుంచి సైకిల్ షాపులో పనికి వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి చేరలేదు. అప్పటి నుంచి బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన భార్య సత్యవతి గురువారం ఆరిలోవ పోలీసులకు తన భర్త అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. రాము మద్యానికి బానిసయ్యాడని, తరచూ తాగిన మైకంలో ఒక్కోరోజు ఇంటికి రాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో రూ.20 వేలు నగదు, సుమారు ఒకటిన్నర తులాల బంగారు గొలుసు కనిపించలేదని, వాటిని రాము తీసుకొని బయటకు వెళ్లిపోయి ఉంటాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్-1 మద్దిలపాలెం మెయిన్ రోడ్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-1 ఈఈ సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మద్దిలపాలెం, భానునగర్, కృష్ణా కళాశాల రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

- అలాగే పిఠాపురం కాలనీలో శివాలయం ఫీడర్ పరిధిలో కూడా మరమ్మతులు చేపట్టనున్నట్టు జోన్-1 ఈఈ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శివాలయం ప్రాంతం, పెద్ద నుయ్యి, ఎర్రయ్య కాలనీ, కేఆర్ఎం కాలనీ, ఎంవీపీ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వెలగపూడికి అభినందనలు


ఎమ్మెల్యే వెలగపూడిని సత్కరిస్తున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు

మద్దిలపాలెం : విశాఖ తూర్పు ఎమ్మెల్యేగా ఎన్నికైన వెలగపూడి రామకృష్ణబాబును మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు సన్మానించి అభినందనలు తెలిపారు.

అప్పన్న స్వామికి ఘనంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

లలితా పీఠంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రచయిత డి.వి.సూర్యారావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి నిర్వహించారు. 24 మంది కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా ఆదికవి నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరించారు. ఈ సభకు ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు.

కవితా గోష్ఠి అనంతరం కవులను స్వామి వారు సత్కరించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని మేనేజర్ తెలిపారు.